గిరిజన గురుకుల పాఠశాల తరగతి గదుల్లో నిద్రిస్తున్న విద్యార్థులు, బీసీ హాస్టల్లో భోజనం కోసం లైన్లో ఉన్న విద్యార్థులు, అపరిశుభ్రంగా మరుగుదొడ్లు, పల్లం ఎస్సీ హాస్టల్ లో విద్యార్థులకు వడ్డిస్తున్న అన్నం






సంక్షేమ హాస్టళ్లు - సమస్యల లోగిళ్లు

ఏర్పేడు: సంక్షేమ హాస్టళ్లలో ఉంటూ చదువుకునే పేద విద్యార్థులు సరైన వసతి, నాణ్యమైన ఆహారం కరువైంది. ప్రభుత్వం విద్యార్థుల బాగు కోసం రూ.కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నా పక్కదారి పట్టుతుండడంతో విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతం. ఏర్పేడు మండలం పల్లం ఎస్సీ సంక్షేమ హాస్టల్లో 108 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ వంటమనిషి, కామాటి లేరు. వాచ్‌మన్ వంట వండి విద్యార్థులకు వడ్డించే పరిస్థితి. అయితే ఉన్న విద్యార్థుల్లో సగం మందికి కూడా చాలకుండా కోడి గుడ్లు పెట్టారు. నీళ్ల సాంబారు, చిమిడిన అన్నం తినలేక విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. ఇక ఏర్పేడు బీసీ హాస్టల్‌లో 25 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు.

హాస్టల్లో నేలపైనే విద్యార్థుల నిద్ర

రేణిగుంట: మండలంలోని విమానాశ్రయం సమీపంలో ఉన్న ఏపీ గిరిజన గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలో 300 మంది విద్యార్థులు ఉన్నారు. హాస్టల్లోని విద్యార్థులు అరుగుపైన, తరగతి గదుల్లో, డెస్క్‌లపైన నిద్రించాల్సి వస్తోంది. రాత్రి 300 మంది విద్యార్థులకు ఒకరే వాచ్‌మన్ ఉన్నారు. మరుగుదొడ్లు దుర్వాసన వెదజల్లుతున్నాయి. రేణిగుంట బీసీ హాస్టల్‌లో 49 మంది విద్యార్థులుండగా అందరూ నేలపైనే నిద్రిస్తున్నారు.

క్లుప్తంగా

కోర్టు ఆవరణలో వాహనాలు నిలిపితే జరిమానా

సత్యవేడు: శ్రీసిటీ కార్మికులు తమ ద్విచక్రవాహనాలను కోర్టు ఆవరణలో నిలిపితే జరిమానా విధిస్తామని ఎస్‌ఐ రామస్వామి హెచ్చరించారు. శ్రీసిటీలో పనిచేస్తున్న పలు కంపెనీల కార్మికులు రోజూ తమ వాహనాలను కోర్టు ఆవరణలో ఉంచి వెళుతుండడంతో కోర్టు, తహసీల్దారు కార్యాలయానికి వచ్చే ప్రజలకు లాయర్లకు, రెవెన్యూ, ట్రెజరీ సిబ్బందికి ఇబ్బందికరంగా ఉంటోంది. రేపటి నుంచి కోర్టు ఆవరణలో వాహనాలు నిలిపితే జరిమానా విధిస్తామని ఓ ప్రకటనలో ఎస్‌ఐ తెలిపారు.

29 నుంచి వీరభద్రుని బ్రహ్మోత్సవాలు

నారాయణవనం: స్థానిక టీటీడీ అనుబంధ ఆలయం భద్రకాళీ సమేత వీరభద్రుని వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 29వ తేదీ మంగళవారం సాయంత్రం అంకురార్పణతో ప్రారంభమవుతాయని ఆలయ అధికారి నాగరాజు తెలిపారు. 30వ తేదీ బుధవారం ఉదయం ధ్వజారోహణంతో ప్రారంభయ్యే ఉత్సవాలు ఆగస్టు 6వ తేదీ బుధవారం సాయంత్రం ధ్వజావరోహణంతో పరిసమాప్తమవుతాయని పేర్కొన్నారు. ఆగస్టు 4వ తేదీ రాత్రి జరిగే ఆర్జిత కల్యాణోత్సవంలో దంపతులు రూ.500 చెల్లించి పాల్గొనవచ్చునని అన్నారు.

తిరుచ్చిపై ఆండాళ్ అమ్మవారు


తిరుచ్చిపై విహరిస్తున్న అమ్మవారు

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆండాళ్ తిరువాడిపుర ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం అమ్మవారు తిరుచ్చి వాహనాన్ని అధిరోహించి గ్రామ వీధుల్లో విహరించారు. సాయంత్రం తిరుచ్చి వాహనాన్ని అధిరోహించిన అమ్మవారు మాడవీధుల్లో విహరిస్తూ భక్తుల నుంచి కర్పూర హారతులు అందుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆండాళ్ అమ్మవారికి ఆస్థానం నిర్వహించి, ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. ఆలయ అధికారి నాగరాజు, అర్జితం అధికారి భరత్, ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గ్లాసుల పంపిణీ

రేణిగుంట: పట్టణంలోని బీసీ హాస్టల్లో శనివారం ఛత్రపతి సాహు మహారాజ్ జయంతి వేడుకలను పూల వెంకటాద్రి యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల మధ్య కేకును కట్ చేసి, హాస్టల్లోని 50 మంది విద్యార్థులకు తాగునీటి గ్లాసులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు ఎంజి రెడ్డి, విద్యాసాగర్, హాస్టల్ వార్డెన్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో జెర్రిపోతు


పామును పట్టుకుంటున్న అటవీ ఉద్యోగి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఆలయంలోని రాహు కేతు పూజ మండపం మెట్ల వద్దకు శనివారం జెర్రిపోతు రావడంతో భక్తులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న ఎస్‌ఓఎస్ సుదర్శన్ రెడ్డి అటవీశాఖ అధికారులకు సమాచారం అందజేశారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారి దాము సంఘటన స్థలానికి చేరుకుని పామును చాకచక్యంగా పట్టుకుని, రామాపురం అడవుల్లో విడిచిపెట్టారు.

డీఈవో తనిఖీ


రికార్డులను తనిఖీ చేస్తున్న డీఈవో

ఏర్పేడు: తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి కేవీఎన్ కుమార్ శనివారం ఏర్పేడు మండల విద్యాశాఖ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించి ప్రగతి నివేదికలపై చర్చించారు. సమ్మేటివ్ ప్రశ్నాపత్రాలకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వ్యాసాశ్రమంలోని ఎస్వీ సంస్కృత హైస్కూల్‌ని సందర్శించారు. కార్యక్రమంలో ఎంఈవోలు ప్రేమలత, దయాకర్ రావు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో రాష్ట్ర హోంమంత్రి



శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయ స్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

మండల అభివృద్ధికి కృషి

- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ పద్మప్రియ


మాట్లాడుతున్న ఎంపీపీ పద్మప్రియ

వరదయ్యపాళెం: అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి చేద్దామని ఎంపీపీ పద్మప్రియ తెలిపారు. శనివారం వరదయ్యపాళెం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా శాఖల వారీగా మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి కేటాయించిన నిధుల వివరాలను వివరించారు. ఎంఈఓ సరస్వతి మాట్లాడుతూ తల్లికి వందనం ఇంకా మండల వ్యాప్తంగా 1,500 మందికి తల్లికి వందనం నిధులు జమ కావాల్సి ఉందని వివరించారు. ఇరిగేషన్ ఏఈ మాట్లాడుతూ మండలంలో ఎఫ్‌డీఆర్ పనుల ద్వారా పలు సాగునీటి కాలువలను ఆధునీకరణ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉపాధి ఏపీఓ గణేష్ మాట్లాడుతూ మండలంలో నిర్మాణం చేసిన 27 గోకులం షెడ్లకు సంబంధించి 20 షెడ్లకు నిధులు జమైనట్లు తెలిపారు. ఎంపీపీ పద్మప్రియ మాట్లాడుతూ అభివృద్ధి పనులకు సంబంధించి సర్పంచులు, ఎంపీటీసీలను అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ ప్రసాద్, తహసీల్దార్ సుధీర్ రెడ్డి, ఏఓ గౌరి, చిన్న పాండూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రశాంత్, విద్యుత్‌శాఖ ఏఈ విజయ్‌వెంకటేష్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భగవద్గీత పారాయణం


విద్యార్థికి బహుమతి ఇస్తున్న నిర్వాహకులు

శ్రీసిటీ(సత్యవేడు): శ్రీసిటీలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం చిన్మయ విద్యాలయ విద్యార్థులు ఆలపించిన భగవద్గీత పారాయణ ఆకట్టుకుంది. శ్రీసిటీ ఆధ్యాత్మిక సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 15 మంది విద్యార్థులు పాల్గొని భగవద్గీతలోని పురుషోత్తమ ప్రాప్తియోగ విశిష్టతపై భక్తిశ్రద్ధలతో పారాయణం చేశారు. చిన్మయ మిషన్ 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని విద్యార్థులు ఈ కార్యక్రమంలో భాగమైనట్లు చిన్మయ ఉపాధ్యాయులు పి.రామచంద్రన్, వి.సంధ్యారెడ్డి తెలిపారు. శ్రీవాణి నిర్వాహకులు విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు అందజేశారు. శ్రీసిటీ ప్రతినిధులు మధురెడ్డి, పీబీఎస్ శాస్త్రి, పల్లేటి బాలాజి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గుడిమల్లంలో సినీ నటి నిరోషా


ఆలయం వద్ద సినీ నటి నిరోషా

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వరుని శనివారం తెలుగు సినీ నటి నిరోషా స్నేహితులతో కలసి దర్శించుకున్నారు. ఆమెకు ఈవో రామచంద్రా రెడ్డి ఆలయ మర్యాదలతో ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి వారి చరిత్రను, ఆలయ విశిష్టతను ఆమెకు తెలియజేసి, స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అర్చకులు పవన్ కుమార్ శర్మ పాల్గొన్నారు.

కోలాహలం.. చెంగాళమ్మ జాతర


శ్రీ గంగమ్మ ముగ్గును వేస్తున్న భక్తులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నీర్పాకోట గ్రామంలోని చెంగాళమ్మ జాతరను రెండవ రోజు శనివారం కోలాహలంగా జరుపుకున్నారు. ఆలయ ఆవరణలో వేసిన శ్రీగంగమ్మ ముగ్గు భక్తులను ఆకట్టుకుంది. శనివారం ఆలయంలోని చెంగాళమ్మ విగ్రహానికి అభిషేకాలు చేసి అలంకరించారు. అనంతరం గంగమ్మ, మైలు ముగ్గు తీర్పు, కలశం ఉత్సవం, శేషపాన్పు, కలశ గ్రామోత్సవం, పోతురాజు ముగ్గులను వేశారు. ఆదివారం ఉదయం అంబుళ్లు, చెంగాళమ్మ దేవత ముగ్గు, పొంగళ్లు జరుగనున్నాయి. సోమవారం ఉదయం చెంగాళమ్మ ఉత్సవమూర్తులను గ్రామంలో ఊరేగింపు, ఎదురుపొంగళ్ల కార్యక్రమం జరుగుతాయని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


గ్రీన్ పాస్‌పోర్ట్ పుస్తకాన్ని విద్యార్థినికి అందజేస్తున్న హెచ్ఎం వాణి

బుచ్చినాయుడుకండ్రిగ: మొక్కల పెంపకంపై విద్యార్థులకు అవగాహన కల్పించి, ప్రోత్సహించేందుకు విద్యార్థులకు మొక్కలను అందించి, గ్రీన్ పాస్‌పోర్ట్ పేరుతో ఒక పుస్తకాన్ని శనివారం కల్లివెట్టు ఉన్నత పాఠశాల విద్యార్థులకు హెచ్ఎం వాణి, ఎకో క్లబ్ సమన్వయకర్త లక్ష్మయ్య అందజేశారు. విద్యార్థులు మొక్కకు వారి తల్లి పేరు పెట్టి, కుదిరిన చోట నాటాలి. తర్వాత ప్రతి మూడు నెలలకోసారి దాని ఎదుగుదల స్థితి పాస్ పోర్టులో నమోదు చేస్తారు. సంవత్సరాన్నికి రెండు సార్లు ఉపాధ్యాయుడు వీటిని నిర్ధారించి సంతకం చేయాల్సి ఉంటుంది. టీచర్లు యువశ్రీ, సురేష్ బాబు, నాదెండ్లమురళి, దాసు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాలకు పచ్చిరొట్ట విత్తనాలు

సాక్షి ఎఫెక్ట్..


అందుబాటులో ఉన్న పచ్చిరొట్ట విత్తనాలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని రైతు సేవా కేంద్రాలకు పచ్చిరొట్ట విత్తనాల బ్యాగులు చేరాయి. గత బుధవారం సాక్షి దినపత్రికలో రైతన్న ఎదురుచూపులు అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన వ్యవసాయాధికారి షణ్ముగం జిల్లా అధికారులతో మాట్లాడి పచ్చిరొట్ట విత్తనాలు జనుము, జీలగలు తెప్పించారు. మండలంలోని 14 రైతు సేవా కేంద్రాల వద్ద సోమవారం నుంచి వీటిని రాయితీపై పంపిణీ చేస్తామని తెలిపారు.

టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి వైద్య సేవలు


హెల్త్ చెకప్ బ్రోచర్లను ప్రదర్శిస్తున్న అధికారులు

రేణిగుంట: తిరుపతి ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి రేణిగుంట సమీపంలోని అమర హాస్పిటల్‌లో శనివారం మెగా మెడికల్ చెకప్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్, హాస్పిటల్ ఎండీ డాక్టర్ గౌరినేని రమాదేవి జ్యోతి ప్రజ్వలన చేసి క్యాంపును ప్రారంభించారు. కార్యక్రమంలో అమర చైర్మన్ డాక్టర్ గౌరినేని ప్రసాద్, డీఎస్పీలు జి.బాలిరెడ్డి, శ్రీనివాస రెడ్డి, ఏసీఎఫ్ శ్రీనివాస్, ఆర్ఐలు కృపానంద, సాయి గిరిధర్, సీఐ సురేష్ కుమార్, ఎస్ఐ రఫీ, ఆర్ఎస్ఐలు, హాస్పిటల్ జీఎం ఆనంద్, సీఈఓ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఎల్లమ్మ తల్లి జాతరకు సర్వం సిద్ధం

రేణిగుంట: గ్రామానికి ఎల్లమ్మ దేవతగా వెలిసిన శ్రీ ఎల్లమ్మ తల్లి జాతర మహోత్సవాలను అందరి సహకారంతో విజయవంతం చేస్తామని ఆలయ ధర్మకర్త ఏలుమలై రెడ్డి శనివారం తెలిపారు. ఎల్లదేవతగా వెలసిన శ్రీ ఎల్లమ్మ తల్లి జాతర ఉత్సవాలు సోమవారం నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పు చేసుకోండి

రేణిగుంట: ప్రభుత్వ ఆస్పత్రిలోనే కాన్పులు చేసుకోవాలని హెల్త్ సూపర్వైజర్లు పుష్పావతి, శివ శంకర్ కోరారు. మండలంలోని వెదల్ల చెరువు ఎస్టీ కాలనీని శనివారం వైద్య సిబ్బంది సందర్శించారు. సకాలంలో గర్భవతులు నమోదు చేసుకుని, ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పు చేసుకుంటే ప్రభుత్వం అందిస్తున్నటువంటి సంక్షేమ పథకాలు అందుతాయని వివరించారు. కార్యక్రమంలో హెచ్.ఎం.మేఘనాథ్, మహిళా పోలీస్ పూర్ణిమ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సౌందర్య, ఆశా కార్యకర్త కుమారి, రాస్ స్వచ్ఛంద సంస్థ ఎడ్యుకేషన్ ఫీల్డ్ కోఆర్డినేటర్ భారతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సాయిచరణ్‌తేజ

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక తెలుగుగంగ కార్యాలయ ఆవరణలో శనివారం శ్రీ చరణ్ హాస్పిటల్ శ్రీకాళహస్తి ఆధ్వర్యంలో జరిగిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో 150 మందికి వైద్యుడు సాయిచరణ్ తేజ వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దీర్ఘకాలిక రోగులను పరిక్షించి, అవసరమైన వారిని పెద్ద ఆస్పత్రులకు రెఫర్ చేశారు. నిర్వాహకులు ఈశ్వరయ్య, ఆశీర్వాదం, పోలయ్య, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్


కార్గిల్ విజయ్ దివస్‌లో విద్యార్థులు, అధ్యాపకులు

వరదయ్యపాళెం: భారత ప్రభుత్వం, యువజన క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో మేరా భారత్, స్వచ్ఛ రూరల్ అర్బన్ డెవలప్‌మెంట్ సొసైటీ సంయుక్తంగా వరదయ్యపాళెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమర వీరుడు భారత సైనిక అధికారి మరియప్పన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సొసైటీ అధ్యక్షుడు మావుడూరు మోహన్, డివిజనల్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గుత్తి త్యాగరాజు, కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ రాధమ్మ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి రవి పాల్గొన్నారు.

బాబు పాలనంతా నయవంచనే!


పార్లపల్లిలో బాబు మోసాలపై క్యూఆర్ కోడ్ ద్వారా వివరిస్తున్న నూకతోటి రాజేష్

- నూకతోటి రాజేష్
- పార్లపల్లిలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ
- సమస్యలను ఏకరువు పెట్టిన గ్రామస్తులు

బుచ్చినాయుడుకండ్రిగ: చంద్రబాబు పాలనంతా నయవంచనే అన్ని సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ విమర్శించారు. శనివారం మండలంలోని పార్లపల్లి, పచ్చాలమ్మ కాలనీలలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కొణతనేని మణినాయుడు ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' కార్యక్రమం జరిగింది. నూకతోటి, పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వివరించి, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేసిన సంక్షేమాన్ని ప్రజలకు గుర్తు చేశారు. క్యూఆర్ కోడ్ ద్వారా గత ఏడాది కాలంలో ప్రతి కుటుంబం ఎంత నష్టపోయిందో వివరించారు. ఆయన మాట్లాడుతూ అధికారం ఉన్నా, లేకపోయినా వైఎస్సార్‌సీపీ ప్రజాపక్షమేనన్నారు. ఎన్నికల ముందు సంపద సృష్టిస్తానని చెప్పిన చంద్రబాబు, అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నీ అప్పులు చేస్తున్నారన్నారు. రూ.1000 పింఛన్ పెంచి, 5 లక్షల మంది పేదల పింఛన్లు తొలగించారని ఆరోపించారు. కూటమి పార్టీలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంలేదని, కూటమి పార్టీల అబద్ధపు హామీలకు మోసపోయామని ప్రజలకు అర్థమైందన్నారు. టీడీపీ నేతలు ఇంటి వద్దకు వస్తే మేనిఫెస్టోను అమలు చేసేంత వరకు నిలదీయాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అర్హులందరికీ ఇవ్వాలని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కొణతనేనిమణినాయుడు డిమాండ్ చేశారు. పలు సమస్యలను ప్రజలు ఏకరవు పెట్టారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బీరేంద్ర వర్మ, భానుప్రకాష్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి గురునాథం, గ్రీవెన్స్ సెల్ కార్యదర్శి సాయినాయుడు, వైస్ ఎంపీపీ బాబురెడ్డి, నేతు జొన్నలగోపాల్‌రెడ్డి, ప్రసాద్‌పాల్, అజయ్‌రెడ్డి, జయచంద్రనాయుడు, సంజీవయ్య, ప్రసాద్, శేఖర్ పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనలో అంతా మోసం

వరదయ్యపాళెం: చంద్రబాబు పాలనలో ప్రజలకు మోసం గ్యారెంటీగా ఉంటుందని, అదే ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ఆయన అనుసరిస్తున్నారని మండలంలోని పద్మావతీపురంలో మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం పద్మావతిపురంలో పార్టీ శ్రేణులు నిర్వహించారు.

ఒక్క పథకం కూడా అందలేదు

కార్యక్రమానికి సమన్వయకర్త నూకతోటి రాజేష్ హాజరు కాగా ఆయన ఎదుట మహిళలు మాట్లాడుతూ చంద్రబాబు పాలన అంతా మోసమని, ఆయన పాలనలో ఒక్క సంక్షేమ పథకం తమకు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు నాయుడు దయాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బీరేంద్ర వర్మ, చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి తిలక్‌బాబు, ప్రచార కమిటీ అధ్యక్షుడు శివాయాదవ్, నేతలు సునీల్, లక్ష్మీనారాయణ, కవిత, బుజ్జమ్మ, భానుప్రకాష్ రెడ్డి, విజయ్‌రెడ్డి, నరేంద్ర, ప్రసాద్, తేజారెడ్డి, మురళిరెడ్డి పాల్గొన్నారు.


పద్మావతీపురంలో క్యూఆర్ కోడ్ ప్రతులను మహిళలకు ఇస్తున్న నూకతోటి రాజేష్

వెంకటకృష్ణయ్య సేవలు చిరస్మరణీయం


అన్నదానం చేస్తున్న, నూకతోటి, వెంకటకృష్ణయ్య కుటుంబసభ్యులు

వరదయ్యపాళెం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి, మాజీ జెడ్పీటీసీ బొప్పన వెంకటకృష్ణయ్య సేవలు చిరస్మరణీయమని, అలాంటి వ్యక్తి మనకు దూరం కావడం బాధాకరమని సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ అన్నారు. వెంకటకృష్ణయ్య 5వ వర్ధంతిని పురస్కరించుకుని వరదయ్యపాళెంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద శుక్రవారం ఆయన తనయుడు బొప్పన తిలక్‌బాబు ఆధ్వర్యంలో వర్ధంతి నిర్వహించారు. వెంకటకృష్ణయ్య చిత్రపటానికి పలువురు పుష్పాంజలి ఘటించారు. అనంతరం అక్కడ స్థానికులకు అన్నదానం నిర్వహించారు.

వెలుగు నిధుల ఆడిటింగ్


రికార్డులు సమర్పిస్తున్న సంఘమిత్రలు

సత్యవేడు: వెలుగు కార్యాలయంలో నిర్వహించిన పలు సంఘాల ఆర్థిక కార్యకలాపాలపై ఆడిట్ నిర్వహించినట్లు ఆడిటర్ కార్తికేయ తెలిపారు. శనివారం వెలుగు కార్యాలయంలో మహిళా సమైక్య ఆదాయ వ్యయాలు, శ్రీనిధి సీఐఎఫ్, ఉన్నతి పథకాలకు సంబంధించి 42 గ్రామ సమైఖ్య సంఘాల ఆర్థిక వ్యవహారాలతో పాటు పాల డెయిరీ ఆదాయ వ్యయాలకు సంబంధించి ఆడిట్ కొనసాగిందని ఏపీఎం డాక్టర్ డాంగేయాదవ్ తెలిపారు. వెలుగు కో-ఆర్డినేటర్లు శివకుమార్, మధుసూదన్, మంగయ్య, పుల్లయ్య, బీఎన్ కండ్రిగ కో-ఆర్డినేటర్ పళని, సంఘమిత్రలు పాల్గొన్నారు.

డ్రగ్స్‌పై అవగాహన

రేణిగుంట: స్థానిక రైల్వే స్టేషన్, బస్టాండ్ కూడలిలో శనివారం తిరుపతి రూరల్ ఎక్సైజ్ సీఐ నరస నాయుడు, ఎస్ఐ అంజలి ప్రసన్న సిబ్బందితో కలిసి స్థానిక డ్రైవర్లకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ రైల్వే స్టేషన్, బస్టాండ్‌లలో ఇతర రాష్ట్రాల నుంచి రైలులో గంజాయిని తీసుకొచ్చి తిరుపతిలో విక్రయిస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. ఇక్కడ ఉన్న ఆటో డ్రైవర్లకు అలాంటి సమాచారం వస్తే 9440902543కు తెలియజేయాలని కోరారు.

సంతను పరిశీలించిన డీఎస్పీ

రేణిగుంట: మండల కేంద్రంలో ఎంతో ప్రసిద్ధిగాంచిన వారపు సంతలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా ఉండడంతో ప్రతి వారం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్న సమాచారంతో శనివారం డీఎస్పీ శ్రీనివాసరావు ఎస్ఐలు అరుణ్ కుమార్ రెడ్డి, సుధాకర్, ఈవో మాధవితో కలసి పరిశీలించారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు ఇచ్చారు.

బీజేపీ తిరుపతి జిల్లా ఉపాధ్యక్షులుగా మేళాగారం

శ్రీకాళహస్తి: బీజేపీ తిరుపతి జిల్లా ఉపాధ్యక్షులుగా శ్రీకాళహస్తి నియోజకవర్గానికి చెందిన మేళాగారం సుబ్రహ్మణ్యంరెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన్ను రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ తదితరులు ఘనంగా సత్కరించారు.